క్లుప్తంగా

విజేతలకు బహుమతులు

మదనపల్లె సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లెలో సోమవారం ఏపీజీఈఏ ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఓ జిల్లా నాయకులు గురుప్రసాద్, కార్యదర్శి శివరాంప్రసాద్, ఉమాశంకర్, మల్లికార్జున, వరలక్ష్మి, పద్మజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరురూరల్ : స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ లోకేశ్వరి తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, అలాగే 6, 7, 8వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31వ తేదీ వరకు గడువు ఉన్నట్లు వివరించారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుంటుదని తెలిపారు.

ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ఇరిగేషన్ ఎస్ఈ విఠల్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ ప్రతాప్, బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, కరస్పాండెంట్ ఎన్.సేతు, వైస్ ప్రిన్సిపాల్ నిశ్చిత సేతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడి, జీడిచెట్లకు నిప్పు



కాలిపోయిన జీడి, మామిడి చెట్లు

పెద్దతిప్పసముద్రం: స్థానిక రంగసముద్రం రోడ్డులోని జీడి చెట్లకు గుర్తు తెలియని ఆకతాయులు సోమవారం నిప్పు పెట్టారు. ఈ ఘటనలో పీటీఎంకు చెందిన రైతు బెస్తగవ్వల సుబ్రమణ్యంకు చెందిన పలు జీడి చెట్లు, మామిడి చెట్లతో పాటు డ్రిప్ పైపులు కాలి బూడిదయ్యాయి. గమనించిన రైతులు మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయంలో సోమవారం సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతా ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బ్రిడ్జి నిర్మించాలని డీఈకి వినతి

బి.కొత్తకోట: హంద్రీ-నీవా పుంగనూరు ఉప కాలువకు సిమెంట్ లైనింగ్ వేస్తే అటు-ఇటు రాకపోకలు స్తంభిస్తాయని బి.కొత్తకోట మండలం గండువారిపల్లి గ్రామస్తులు సోమవారం హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ లింగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఈ కార్యాలయానికి వెళ్లిన గ్రామస్తులు ఆయనకు సమస్యను వివరించారు. కాలుపై రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఇప్పటికే పొలాలకు వెళ్లేందుకు మార్గం లేదని, పశువులు, గొర్రెలు మేపుకునేందుకు, పంటలు సాగు చేసేందుకు ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించడం జరిగిందని తెలిపారు. లైనింగ్ పనులు జరుగుతున్నందున అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకుని బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. దీనిపై డీఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తలపుల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. 21 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పు అయ్యే వరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో సురక్షిత ప్రసవం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో పని చేస్తున్న సుజాత సహకారంతో గర్భవతులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

గజవాహనంపై శ్రీ లక్ష్మీనారసింహుడు



స్వామివారికి స్నపన తిరుమంజనం కావిస్తున్న అర్చకులు



గజవాహనంపై స్వామివారు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని అర్చకులు, భక్తులు గజవాహనంపై ఊరేగించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజైన సోమవారం ఉదయాన్నే మూలవర్లకు తోమాలసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తిరుచ్చి ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారి తిరుచ్చి వాహనంలో స్వామి వారిని కొలువు దీరి మేళ తాళాలతో, నాట్యకళాబృందాల సాంస్కృతి కార్యక్రమాలతో ఊరేగింపు రంగరంగ వైభవంగా సాగింది. ఆలయంలోస్వామి మండపంలో స్వామి వారికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. సాయంకాలం స్వామి వారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. స్వామివారిని గజవాహనం పై కొలువుదీర్చి విశేషపూజలు నిర్వహించి గ్రామ పుర వీధుల్లో స్వామివారిని ఊరేంచారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తులు,భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారి సేవలో తరించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

దారి సౌకర్యం కల్పించాలని వినతి

–పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు వినతులు



సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫిర్యాదుదారుడు

మదనపల్లె: మదనపల్లె పట్టణం అయోధ్యనగర్‌లో దారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు సోమవారం పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. అయోధ్యనగర్ తూర్పుభాగంలో సుమారు 40 కుటుంబాలు ఉన్నాయని ఇంటి టాక్సులు కడుతున్నామన్నారు. రామారావుకాలనీకి చెందిన అశోక్‌నాయుడు, కలకడ వేణుగోపాల్, శంకరలు దారి వుండే ప్రాంతంలో ప్లాటు వేసి గునాదులు తవ్వడం చేస్తున్నారన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. పలువురు వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అదనంగా నిధులు

పీలేరు : ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రోత్సహిస్తూ పీఎం జన్మన్ స్కీమ్ కింద అదనంగా నిధులు మంజూరైనట్లు హౌసింగ్ డీఈ రమణయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా ఏనుగు మల్లమ్మ, గౌరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వచ్చారు. భక్తులకు ఈఓ మునిరాజ, కొండ కిట్ట ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మిట్స్‌లో 21, 22న జాతీయ ఐపీ యాత్ర

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో ఈనెల 21,22న మేధో సంపత్తి (ఐపీ) (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) ఆవిష్కరణ-భవిష్యత్తుపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతను శక్తి వంతం చేయడం లక్ష్యంగా ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశోధకులు, విద్యా వేత్తలు, వ్యవస్థాపకులు, చట్టపరమైన సలహాదారులు, ఇంక్యుబేషన్ మేనేజర్లకు ప్రయోజనకరంగా ఉండగలదన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కరాటేలో ప్రతిభ

పీలేరు : రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 1వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో పీలేరుకు చెందిన యోధా ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు. ఈ నెల 9న జరిగిన కరాటే పోటీల్లో పీలేరు యోధా మార్షల్ ఆర్ట్స్‌కి చెందిన జి. గీతశ్రీ అండర్ 14 కటా క్యాటగిరిలో మూడవ స్థానం, కుమ్మితే క్యాటగిరిలో మొదటి స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. 300 మంది పాల్గొన్న పోటీల్లో తమ విద్యార్థి విశేష ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు.

సూర్యప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారిని మేళ తాలల నడుమ సూర్య ప్రభావాహనంపై వైభవంగా ఊరేగించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామతాభిషేకాలు, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

‘యువతపోరు’ విజయవంతం చేద్దాం



యువత ఫీజుపోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిసార్ అహ్మద్ తదితరులు

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే చెల్లించేలా కూటమి ప్రభుత్వ కళ్ళు తెరిపిద్దామని మదనపల్లె వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఈ నెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే యువత ఫీజుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలైన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు కాలేజీలకు చెల్లించడంలో విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కాలేజీలకు చెల్లించకుండా చేతులు ఎత్తేయడంతో పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక, పరీక్షలు రాయలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తెచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పేద విద్యార్థులకు వరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు బడ్జెట్లో నిధులు కేటాయించక పోవడంతో కూటమి వైఖరి తేటతెల్లమైందన్నారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజ్ నిర్వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో బీరంగి రేవతి, చంద్రమౌళి, వీఎస్ రెడ్డి, వలసపల్లి నాగరాజు రెడ్డి, ఎస్ఎ కరీముల్లా, శారద రెడ్డి, ఈశ్వర్ నాయక్, శ్యామల, మేరీ, నాగమణి, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్బంధం దారుణం

బి.కొత్తకోట: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై విజయవాడలో చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి నిర్బంధించడం దారుణమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ బి.కొత్తకోట ప్రాజెక్టు అధ్యక్షురాలు కుమారి అన్నారు. సోమవారం బి.కొత్తకోటలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాలనుంచి విజయవాడకు వెళ్తున్న వారిని అడ్డుకుని ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. వాహనాల్లో వెళ్తున్న వారిని రవాణాశాఖ అధికారులతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సలీంబాషా మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని ఒత్తిళ్లకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 42 రోజుల సమ్మెకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత జీవోలనే కొత్త జీవోలుగా ఇచ్చి మోసం చేస్తున్నారని అన్నారు. హామీలపై సీఎం చంద్రబాబు మోసగించడం అన్యాయమని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ సభ్యుడు బాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, రాధమ్మ, అనసూయ, గీత, హరిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నాకు కుట్ర

పెద్దతిప్పసముద్రం: యూనియన్ నాయకుల పిలుపు సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు పూనుకున్నారు. అయితే ప్రభుత్వం ధర్నాను భగ్నం చేసే ప్రక్రియలో భాగంగా పోలీసులచే అంగన్‌వాడీలను రాష్ట్రంలోని పలు చోట్ల అడ్డుకుని నిర్బంధించారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే సూపర్‌వైజర్లు సెక్టార్ల వారీగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమీక్షించి యాప్‌లపై అవగాహన కల్పించి, సాంకేతిక లోపాలుంటే వాటిని సవరించి అప్‌డేషన్ చేయించాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ ఆయా ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవోలను ఆదేశించారు. ఈ తరుణంలో బి.కొత్తకోట ప్రాజెక్టు పరిధిలోని సీడీపీవో భాగ్యమ్మ ఆదేశాల మేరకు సూపర్ వైజర్లు సమావేశ నిర్వహణ కోసం వారి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి కూర్చున్నారు. సమావేశాలను కార్యకర్తలు బాయ్‌కాట్ చేశారు. గంటల కొద్దీ నిరీక్షించిన సూపర్‌వైజర్లు చేసేదేమీలేక వెనుదిరిగి వెళ్లిపోయారు.

తొలితరం ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే



పీలేరు: సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



మదనపల్లె: సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద బాస్ నాయకులు

మదనపల్లె సిటీ: పీడిత ప్రజల, స్త్రీ విద్య కోసం నిరంతరం కృషి చేసిన సంఘసంస్కర్త, తొలితరం ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బాస్ సంస్థ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ అన్నారు. సోమవారం కాలనీగేట్‌లోని న్యూ అంబేద్కర్ సర్కిల్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే సంఘ సంస్కకర్త, రచయిత్రి, తొలి మహిళా ఉపాధ్యాయులగా ప్రసిది చెందిదని తెలిపారు. కార్యక్రమంలో బాస్ నాయకులు కృష్ణ, రెడ్డప్ప, గంగాధర్, శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జన్నే రాజేంద్రనాయుడు, పాదల నరసింహులు, మౌలాలి, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పీలేరురూరల్ : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాస్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు తుమ్మల ధరణికుమార్ మాట్లాడుతూ మహిళాశక్తికి ఆమె ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన ఆమె స్త్రీలకు చదువు చెప్పి, వారిలో చైతన్యం నింపిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. కార్యక్రమంలో బాస్ నాయకులు కృష్ణయ్య, హరినాథ, గురవయ్య, హరీష్, కిషోర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు సావిత్రిబాయి పూలే

బి.కొత్తకోట: తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని హ్యూమనరైట్స్ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రవీంద్ర అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ దేశంలో మహిళల సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం, విద్య, సామాజిక కట్టుబాట్ల నుంచి విముక్తి కల్పించే విషయంలో చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఖాజాపీర్, ఉపాధ్యాయులు ఈ.మునిరెడ్డి, చలపతి, గోవిందరెడ్డి, నక్కామహేష్, ముబారక్, చంద్ర పాల్గొన్నారు.

15న కనుమలో గంగమ్మ జాతర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాతర నిర్వాహకులు

మదనపల్లె సిటీ: స్థానిక పుంగనూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ ఆలయంలో ఈనెల 15 నుంచి జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యుగంధర్, వెంకటరమణ, రమణ, గురుమూర్తి, కార్తీక్, నారాయణ తెలిపారు. సోమవారం ఆలయం వద్ద జాతర ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. 15వతేదీ (శనివారం) రాత్రి తిరునాలను చాందినీబండ్లు, కీలుగుర్రాలు, బళ్లారి డ్రమ్స్, గెరిగలు, చెక్కభజనలతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. 16వతేదీ (ఆదివారం) పగలు తిరునాల జరుగుతుందన్నారు. సాయంత్రం ఉట్ల తిరునాల నిర్వహిస్తామన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మురహరి, విక్రం, ప్రసాద్, పూజారి వెంకటరమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీడీ రామనాథంరావు

మదనపల్లె: సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య, ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని నేషనల్ వెక్టార్ బార్న్ డీసీజస్ కంట్రోల్ ప్రొగ్రాం రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఎ.టి.రామనాథరావు అన్నారు. సోమవారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని మైక్రోబయాలజీ ల్యాబ్, పీపీ యూనిట్ ల్యాబ్‌లను తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని త్యాగరాజవీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు పట్టణంలోని మున్సిపల్,గ్రామాల్లోని పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి బారిన పడిన ప్రజలను వెంటనే ఆస్పత్రులకు వచ్చేలా చేయాలన్నారు. వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లో ఆరు వారాల పాటు నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. వైద్య పరీక్ష ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్, ల్యాబ్‌టెక్నీషియన్లు హితైషీ, షమీమ్, జానకిరామ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

–మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్నట్లు యువత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తామని, డీఎస్సీ నిర్వహిస్తామని యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అలాగే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలన్నీ సూపర్ మోసాలుగా మిగిలిపోయాయని మండిపడ్డారు. యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగ యువతీయువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎనుములవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములురాజు కుమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి రోడ్డు మార్గంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ మేకల రెడ్డెప్పరెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. గర్నిమిట్టకు చెందిన మిరియాల నాగిరెడ్డి అనారోగ్యంతో ఉండడంతో పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, నారే వెంకటరమణారెడ్డి, అమరనాథరెడ్డి, చక్రధర్, కాలనీ చిన్న, పి. ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, ఆనంద్, విక్టరీ వెంకటరమణారెడ్డి, ఆబిద్, షాకీర్, భువనేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేస్తే బెదిరిస్తారా

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎస్సీ నాయకుల ధర్నా



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎస్సీ సంఘాల నిరసన

బి.కొత్తకోట: పెద్దతిప్పసముద్రం మండలం పోతుపేట పంచాయతీలో అవినీతి జరిగిందని విచారణ జరపాలని ఫిర్యాదు చేసినందుకు బెదిరింపులకు పాల్పడతారా అని ఎస్సీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పెద్దతిప్పసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం మండలాలకు చెందిన ఎస్సీ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. పోతుపేట పంచాయతీలో అవినీతి జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు విచారణ మొదలైతే ఓ వ్యక్తి మద్యం సేవించి తమను బెదిరించాడని నేషనల్ హెల్ప్‌లైన్ అగైనెస్ట్ అట్రాసిటీ సభ్యుడు కేవీ.రమణ అన్నారు. ఈ బెదిరింపుకు తాము భయపడబోమన్నారు. తమను ప్రభుత్వ కార్యాలయాల్లోకి రానివ్వకూడదని ప్రచారం చేస్తున్నారని, కార్యాలయాలు ప్రైవేటు సంస్థలా అని ప్రశ్నించారు. పోతుపేట పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, వాటిపై కలెక్టర్ స్పందించి మదనపల్లి డీఎల్‌పీఓను విచారణ అధికారిగా నియమించారన్నారు. ఆయన విచారణ కోసం రికార్డులను తీసుకెళ్లారని, దీనిపై గ్రామసభ నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. అనంతరం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్‌తో సమావేశమై సమస్యను వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాలకు చెందిన నాయకులు రాజన్న, గంగాద్రి, సోము, నరసింహులు, లక్ష్మినారాయణ, వెంకటరమణ, అలివేలమ్మ, సింగన్న, వెంకటేష్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ ఆంజనేయరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో ఖేలో భారత్ కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు శారీరక, మానసిక ధారుఢ్యం పెరగడం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, ఏబీవీపీ సంఘటన కార్యదర్శి సుమన్, సాయిహితేష్, ప్రకాష్, కిషోర్,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో వాలీబాల్ పురుషుల విభాగంలో మొదటి బహుమతి శ్రీనివాస డిగ్రీ కాలేజీ, ద్వితీయ బహుమతి జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ, మహిళావిభాగంలో మొదటి బహుమతి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ,ద్వితీయ బహుమతి బీటీ డిగ్రీ కాలేజీ గెలుపొందారు. కబడ్డీ పోటీలోల పురుషుల విభాగంలో మొదటి బహుమతి జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ, ద్వితీయ బహుమతి బీటీ డిగ్రీ కాలేజీ,. మళిహిళా విభాగంలో జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ, ద్వితీయ బహుమతి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ గెలుపొందారు. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేసి అభినందించారు.